క్లుప్తంగా

290 మందికి వైద్య పరీక్షలు



రాజుపాలెం: మండలంలోని నెమలిపురి గ్రామ సచివాలయం–2 పరిధిలోని దేవరంపాడులో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మంగళవారం జరిగింది. శిబిరంలో డాక్టర్ వెంకటకృష్ణకుమార్‌తో పాటు ముగ్గురు స్పెషలిస్టులు డాక్టర్ లక్ష్మణరావు(పిడియాట్రీషన్), డాక్టర్ సరస్వతీ (జనరల్ మెడిసిన్), డాక్టర్ రామకృష్ణారెడ్డి (కంటి వైద్యులు) పాల్గొని, 290 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. కంటి వైద్యులు రామకృష్ణారెడ్డి 49 మందికి కంటి పరీక్షలు చేసి, కళ్లజోళ్లకు రిఫర్ చేశారు. బీపీ, షుగర్ ఉన్న వాళ్లకు 15 రోజులకు సరిపడ మందులు అందించారు. హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్ తేజస్విని, దేవానాయక్, ఆరోగ్య సిబ్బంది నాగమణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చల్లగా చూడమ్మ మద్దిరావమ్మ




పెదకూరపాడు: చల్లంగా చూడమ్మా... మద్దిరావమ్మా.. అంటూ భక్తులు మండలంలోని లగడపాడు గ్రామంలో కొలువైన మద్దిరావమ్మ అమ్మవారి పునఃప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని, వేడుకున్నారు. గ్రామ దేవత మద్దిరావమ్మకు పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, పాడి పంటలతో చల్లగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి వెండి కిరీటం బహూకరణ



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి వెండి కిరీటం, తీర్థపుగిన్నె, ఉద్దరిణలను అమరావతికి చెందిన వస్త్ర వ్యాపారి కొప్పురావూరి శివసత్య రాజేంద్రప్రసాద్, రాజ్యలక్ష్మి దంపతులు మంగళవారం అందజేశారు. 527 గ్రాముల వస్తువుల విలువ రూ.43వేలు. ఆలయంలో సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించి, ఈవో వేమూరి గోపినాథ శర్మకి అప్పగించారు. అనంతరం అర్చకుడు శంకర మంచి రాజేశ్‌శర్మ స్వామివారికి కిరీటం అలంకరించారు. దాతలు అమరేశ్వరునికి, బాల చాముండేశ్వరి, సుబ్రహ్మణ్యేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎమ్మెల్యే శంకరరావు వాహనాల తనిఖీ



బెల్లంకొండ: ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కాన్వాయ్‌ను మాచాయపాలెం క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం పోలీసులు తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్థానిక ఎస్‌ఐ.రాజేష్ సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే శంకరరావు వారికి పూర్తి సహకారం అందించి, తన వాహనం నుంచి కిందకు దిగారు. ఎస్‌ఐ రాజేష్ తన సిబ్బందితో కలసి అన్నీ వాహనాలను తనిఖీ చేశారు. వాహనాల్లో ఎటువంటి నగదు కానీ, ఇతర వస్తువులు లభించలేదు.

టీడీపీ నాయకుడు కంచేటి అరెస్ట్

సత్తెనపల్లి: పెదకూరపాడు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకుడు కంచేటి సాయికుమార్‌ను ముంబయిలో ఏపీ పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం సత్తెనపల్లి టౌన్ పోలీస్‌స్టేషన్‌కు కంచేటి అతనిని తీసుకువచ్చారు. అమరావతి మండలం ధరణికోట గ్రామంలో ఈ నెల 15న వైఎస్సార్ సీపీ కార్యాలయానికి నిప్పు పెట్టిన కేసులో ఇద్దరిని పది రోజులు క్రితం అరెస్ట్ చేయగా.. రెండు రోజుల క్రితం ముంబయిలో కంచేటి సాయికుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సాయికుమార్‌ను అమరావతి సీఐ అవ్వారు వెంకట బ్రహ్మం రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి మహ్మద్ గౌస్ ఏప్రిల్ 8 వరకు రిమాండ్ విధించారు. సాయికుమార్ అరెస్ట్ తెలుసుకున్న పెదకూరపాడు టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ కార్యకర్తలతో సత్తెనపల్లి పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు.

ముస్లింలకు రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత వైఎస్సార్‌దే





మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు, సమావేశానికి హాజరైన ముస్లిం మైనార్టీ సోదరులు

- ముస్లిం సంక్షేమానికి వైఎస్సార్ సీపీ కృషి
- కన్నా, లావు పార్టీలకు కన్నాలు వేసి వెళ్లారు
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లిలో ముస్లిం వర్గాలతో ఆత్మీయ సమావేశం

సత్తెనపల్లి: ముస్లిం, మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ అమలు చేసిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిదేనని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పట్టణ ముస్లిం మైనార్టీ వర్గాల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. సమావేశానికి పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడారు. 50ఏళ్లకు పైగా జలవనరుల శాఖ స్థలంలో మసీదు ఉండగా.. రూ.9.60 కోట్ల విలువైన ఆ స్థలాన్ని చొరవ తీసుకుని, సీఎం వైఎస్ జగన్‌తో మాట్లాడి మసీదుకు కేటాయించామన్నారు. కనీస ధర రూ.లక్ష కూడా తానే చెల్లించానని చెప్పారు.అలాగే నకరికల్లు మండలం గుండ్లపల్లి కమ్యూనిటీ హాల్ రూ. 50 లక్షలతో నిర్మాణం, రాజుపాలెం మండలం కొండమోడులో రూ.3 కోట్లు విలువచేసే అర ఎకరా ప్రభుత్వ స్థలం ముస్లిం కమ్యూనిటీ హాల్‌కు అందించి, రూ.30 లక్షలు నిధులతో భవనం నిర్మిస్తున్నట్లు చెప్పారు. అలాగే పట్టణంలోని పిడుగురాళ్ల మార్గంలో చెక్ పోస్టు వద్ద ఖబర్ స్థాన్ స్థలంలో 41 గదులు నిర్మించి, ముస్లిం మైనార్టీ వర్గాలకే వాటిని కేటాయించామన్నారు. ఆర్థికంగా వారు ఎదిగేందుకు అవకాశం కల్పించామన్నారు. అలాగే పట్టణంలోని ఈద్గా ప్రహరీ నిర్మాణానికి రూ.75 లక్షలతో అంచనాలు పూర్తయ్యాయని, మళ్లీ ప్రభుత్వం రాగానే పూర్తి చేయిస్తానన్నారు. ముస్లిం వర్గాల కోరిక మేరకు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోగా షాదీఖానా వద్ద డాక్టర్ అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని మంత్రి అంబటి హామీ ఇచ్చారు. మదర్సాలు, మసీదులు బాగు చేయిస్తానని మాట ఇచ్చారు. 12 ఏళ్లుగా నియోజకవర్గంలో నివసిస్తున్నానని, తాను పక్కా లోకల్ అని స్పష్టం చేశారు. ఇక్కడ తనపై పోటీ చేస్తున్న వారే నాన్ లోకల్ అన్నారు. కన్నా లక్ష్మీనారాయణ, లావు శ్రీకృష్ణ దేవరాయలు ఆయా పార్టీలకు కన్నాలు వేసి వెళ్లారని విమర్శించారు. సమావేశంలో పల్నాడు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, నియోజకవర్గ పరిశీలకుడు పడాల శివారెడ్డి, పార్టీ నాయకులు ఎండూరి ఉపేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరా, మత పెద్దలు సుభానీ ఖాన్, ఖలీలు, షరీఫ్, బడా నున్నా, కౌన్సిలర్లు డాక్టర్ సయ్యద్ సలీం, షేక్ తాహేర్ ఉన్నిసా గని, ముస్లిం మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు షేక్ నాగుల్ బాషా, నాయకులు హుస్సేనా మేస్త్రి, షఫీ, చిన్నమాబు, మార్కెట్ రేనా, గోరబుడే, భారీ సంఖ్యలో పట్టణ ముస్లిం మైనార్టీలు పాల్గొన్నారు.

లక్కరాజుగార్లపాడులో పర్యటన..

వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు ఆధ్వర్యంలో లక్కరాజుగార్లపాడు గ్రామంలో మంత్రి అంబటి పర్యటించారు. స్థానిక కీలక నాయకులతో భేటీ అయ్యారు. యువజన విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు పడాల శివారెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతా హసంతి, జిల్లా కార్యదర్శి డాక్టర్ మక్కెన అచ్చయ్య, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కరరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్, నాయకులు పాల్గొన్నారు. లక్కరాజు గార్లపాడు వెళ్లే మార్గంలో ఇటుక బట్టీల కార్మికులను మంత్రి పలకరించారు. కొద్దిసేపు పరిశీలించి, స్వయంగా మడి ఇటుకను తయారు చేశారు. కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు.

వైఎస్సార్ సీపీలో టీడీపీ, జనసేన కుటుంబాల చేరిక

> పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే నంబూరు

అచ్చంపేట: మండలంలోని కొత్తపల్లికి చెందిన టీడీపీ, జనసేన పార్టీల నుంచి 10 కుటుంబాలు మంగళవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. పార్టీ కండువాలు కప్పి వారిని ఆయన సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీకి రోజు రోజుకు ఆదరణ పెరుగుతోందన్నారు. గత ఐదేళ్లలో ప్రతి కుటుంబానికి మంచి జరిగిందని, ప్రతి గ్రామంలో జరిగిన అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కాబట్టే అన్ని వర్గాలవారు వైఎస్సార్ సీపీ వైపు చూస్తున్నారన్నారు. ఈ సారి గెలవగానే పులిచింతల బ్యాక్ వాటర్‌ను బెల్లంకొండ, అచ్చంపేట, క్రోసూరు మండలాలకు వచ్చే విధంగా కృషి చేస్తానన్నారు. మాదిపాడు కృష్ణానదిపై మంజూరైన వంతెన నిర్మాణాన్ని పూర్తి చేస్తానన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలను మెరుగు పరుస్తానని చెప్పారు. పార్టీలో చేరిన వారిలో కట్టికోట రమేష్, కట్టికోట రవీంద్ర బాబు, కట్టికోట రాము, కట్టికోట పెద్ద నరసింహయ్య, కట్టికోట అశోక్, గురజాల చినమస్తాన్ రావు, గురజాల శివకోటేశ్వరరావు, పసుపులేటి గోపి తదితరులున్నారు. మాదిపాడుకు చెందిన కంబాల రాంబాబు జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మార్కపూడి దేవదానం, మార్కెట్‌యార్డు డైరెక్టర్ మేకల శ్రీనివాసరావు, అచ్చంపేట సర్పంచ్ షేక్ జాని, మాజీ సర్పంచ్ కంబాల వీరబాబు, కో–ఆప్షన్ సభ్యుడు షేక్ సుభాని తదితరులున్నారు.



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తా



సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడు షేక్ నాగుల్ బాష అన్నారు. రెండవసారి మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లిం మైనార్టీలకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి నాలుగు శాతం రిజర్వేషన్ అమలు చేశారన్నారు. ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కులాలు, మతాలు, పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలను ఇంటి ముంగిటకే చేరుస్తున్నారని అభినందించారు. తనపై ఎంతో నమ్మకం తో పట్టణ అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర జలవన రుల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. నాగుల్ బాషను మంత్రి అంబటి రాంబాబు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పడాల శివారెడ్డి పూలమాలలు సత్కరించారు.

వీధికెక్కిన టీడీపీ వర్గపోరు

- ఎడమొహం పెడమొహంగా రెండు వర్గాలు
- చెరుకుంపాలెం ర్యాలీలో బహిర్గతం

అచ్చంపేట: మండలంలోని టీడీపీ నాయకుల వర్గ పోరు బహిర్గతమైంది. ఇప్పటివరకు ఆ పార్టీని భుజాన వేసుకుని అన్నీతామై నిలబడిన కొమ్మాలపాటి శ్రీధర్ వర్గీయులు అంటీముట్టనట్లు ప్రస్తుతం వ్యవహరిస్తున్నారు. కొంతకాలంగా స్థానికులను కాదని, గుంటూరులో నివాసముంటున్న కొంత మంది మాటలకే టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ విలువ ఇస్తున్నారని వారు మనస్తాపం చెందారు. గత ఐదేళ్లలో అధికారం లేకపోయినా టీడీపీ వెన్నుదన్నుగా నిలబడిన నిజమైన కార్యకర్తలను చిన్న చూపు చూపిస్తున్నారని కొంతమంది తెలుగు తమ్ముళ్లు బాహాటంగా విమర్శిస్తున్నారు.

చెరుకుంపాలెంలో మంగళవారం రాత్రి నిర్వహించిన టీడీపీ ర్యాలీకి అంతంతమాత్రపు స్పందనే లభించింది. బయట నుంచి భాష్యం ప్రవీణ్ ఏర్పాటు చేసిన కార్లలో గుంటూరు, సత్తెనపల్లి, పెదకూరపాడు నుంచి వచ్చినవారి కంటే స్థానికులు చాలా తక్కువ మందే హాజరయ్యారని.. ఆ పార్టీ నాయకులే చెబుతున్నారు. 100 నుంచి 150కి మించి స్థానికులు లేకపోవడంతో ప్రవీణ్ అనుకూల వర్గం అసహనం వ్యక్తం చేస్తోంది. మొక్కుబడిగా హాజరైన కొమ్మాలపాటి వర్గీయులు మాత్రం అధినాయకత్వానికి తగినశాస్తి జరిగిందని భావిస్తున్నారు. చెరుకుంపాలేనికి పక్కనే ఉన్న చింతపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న ఒక ఎస్సీ కార్యకర్తను కనీసం పరామర్శించడానికి కూడా టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ విముఖత చూపడంతో.. ఇక గెలిస్తే తమను పట్టించుకునే పరిస్థితులు ఉంటాయా అని అదే సామాజిక వర్గానికి చెందిన ఒక నాయకుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. పరిస్థితి ఇలాగే ఉంటే.. అచ్చంపేట మండలంలో వైఎస్సార్ సీపీకి 10వేలకు పైగా మెజార్టీ రావడం అంత కష్టమేమీ కాదని టీడీపీ సీనియర్ నాయకులే భావిస్తున్నారు. టీడీపీ అభ్యర్థిని ప్రకటించి ఇప్పటికి రెండు వారాలకు పైగా గడిచినా.. ఇప్పటికి టీడీపీ అభ్యర్థి ఎవరో తెలియనివారు మండలంలో మూడువంతులకు పైగా ఉన్నారనడంలో అతిశయోక్తి లేదు. చివరిలో డబ్బుతో ఓటర్లను గొనుగోలు చేసి, విజయం సాధించాలనుకునే నాయకత్వాన్ని ఆ పార్టీ నేతలే తప్పుపడుతున్నారు. దీంతో నిత్యం ప్రజల్లో ఉండే ఎమ్మెల్యే నంబూరు శంకరరావును.. టీడీపీ అభ్యర్థి భాష్య ప్రవీణ్ ఎదుర్కోగలరా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల ఖర్చుపై అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలి

> ఎన్నికల అధికారి కందుల శ్రీరాములు



రాజకీయ పార్టీ నాయకులతో ఆర్వో కందుల శ్రీరాములు

పెదకూరపాడు: ఎన్నికల ఖర్చులపై ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలని, నియోజకవర్గ ఎన్నికల అధికారి కందుల శ్రీరాములు అన్నారు. మంగళవారం పెదకూరపాడులోని ఎన్నికల కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులకు ఎన్నికల ఖర్చుపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థికి రూ.40 లక్షలు ఖర్చు చేయాలని, నామినేషన్ ముందు ఖర్చు చేసిన ప్రతి ఒక్క రూపాయి అభ్యర్థి ఖాతాలోకి వెళ్తుందన్నారు. ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులు ప్రత్యేక బ్యాంకు ఖాతాను తెరిచి, అందుకనుగుణంగా ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆయా రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం ఉప సర్పంచ్ సుభాని వైఎస్సార్ సీపీలో చేరిక



పార్టీలో చేరిన సుభాని, అనిల్‌కుమార్‌తో మంత్రి అంబటి

సత్తెనపల్లి: రాజుపాలెం మండలం రెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ నిమ్మకాయల సుభాని టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. టీడీపీని వీడిన నిమ్మ కాయల సుభాని, కె.అనిల్‌కుమార్‌కు మంత్రి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, వైఎస్సార్ సీపీ నాయకులు మర్రి సుబ్బారెడ్డి, బాషా, మిలటరీ సుభాని, పక్కాల సూరిబాబు, తోట లక్ష్మీనారాయణ, ఈవూరి బ్రహ్మారెడ్డి, నల్లబోతు శివనారాయణ ఉన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అనిల్ కుమార్



కంబాల అనిల్‌కుమార్

సత్తెనపల్లి: బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కంబాల అనిల్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి కంబాల అనిల్ కుమార్‌తో పాటు గంగూరి అజయ్‌కుమార్ పోటీ పడి నామినేషన్ దాఖలు చేశారు. అజయ్‌కుమార్ సోమవారం తన నామినేషన్ ఉప సంహరించుకోవడంతో అధ్యక్ష పదవి ఏకగ్రీవమైంది. అలాగే సెక్రటరీగా మన్నెం వెంకటేశ్వర్లు, సెక్రటరీ (సబ్‌కోర్టు)గా బీఎల్ కోటేశ్వరరావు, ట్రెజరర్ గా బుర్రి సైదయ్య, ఎగ్జిక్యూటివ్ మెంబరు సీనియర్‌గా ఆకుల నాగార్జున, లైబ్రేరియన్‌గా కోటగిరి లక్ష్మణ గోవింద చారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల బరిలో ఉపాధ్యక్ష పదవికి బాణావత్ అమరయ్య నాయక్, పాటి బండ్ల.రవి, జాయింట్ సెక్రటరీ పదవికి కాశిమాల మార్క్, బయ్యవరపు నరసింహారావు, ఏడుకొండలు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ జూనియర్‌గా తాళ్లూరి రాజా విజయ భరత్, తవ్వా హరనాథ్, ఉడుముల విద్యాసాగర్ రెడ్డి పోటీలో నిలిచినట్లు ఎన్నికల అధికారి సయ్యద్ అబ్దుల్ రహీం తెలిపారు. ఈ నెల 28న ఎన్నిక జరగనుండగా మొత్తం 141 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోండి



షోలాయపాలెం గ్రామంలో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న ఎన్నికల అధికారి



గణపవరం గ్రామ లైబ్రరీ బూత్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఎంసీసీ స్క్వాడ్ హెడ్ షేక్ జాకీర్ హుస్సేన్

- ఎన్నికల కమిషన్ ఆదేశాలను తూ.చ తప్పకుండా పాటించాలి
- బెదిరింపులకు పాల్పడితే కఠినచర్యలు

బొల్లాపల్లి: ఎన్నికల కమిషన్ ఆదేశాలను తూ.చ తప్పకుండా పాటించాలని తహసీల్దార్, ఏఆర్వో బి.వి.రమణారావు తెలిపారు. మండలంలోని గండిగనుమల సచివాలయ పరిధిలోని షోలాయపాలెం గ్రామాన్ని తహసీల్దార్‌తో పాటు ఎన్నికల అధికారులు మంగళవారం సందర్శించారు. గ్రామం నుంచి కొందరు ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆదేశాల మేరకు గ్రామంలో ఓటు హక్కుపై అవగాహన కల్పించామని తహసీల్దార్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పూర్తిస్థాయిలో గ్రామాల్లో బందోబస్తు చర్యలు తీసుకుంటామన్నారు. ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, పోలింగ్ బూత్‌ల వద్ద బందోబస్తు ఉంటుందని తెలిపారు. పోలింగ్ బూత్‌ల వద్ద బెదిరింపులకు పాల్పడినా, ఓటర్లను బెదిరించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సమాచారం ఇస్తే తక్షణమే తగుచర్యలు ఉంటాయని తెలిపారు. శాంతిభద్రతల విషయంలో విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ డి.చెన్నకేశవులు ఈ మేరకు హెచ్చరించారు. గ్రామాన్ని సందర్శించిన వారిలో ఎంపీడీవో, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ వి.ఎ.విజయ్ కుమార్, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎస్‌కే జిలానీ బాషా ఉన్నారు.

గణపవరంలో ఎంసీసీ స్క్వాడ్ తనిఖీలు

నాదెండ్ల: పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల దూరంలో ఎలాంటి రాజకీయ పార్టీల కార్యాలయాలు గానీ, ఫ్లెక్సీలు, బ్యానర్‌లు, ప్రచార సాధనాలు ఉండకూడదని ఎంపీడీవో, ఎంసీసీ స్క్వాడ్ హెడ్ షేక్ జాకీర్ హుస్సేన్ చెప్పారు. గణపవరంలోని 15 పోలింగ్ బూత్‌లను మంగళవారం ఆయన పరిశీలించారు. గ్రామ నడిబొడ్డున రెండు పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు చర్య లు చేపట్టాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రచార వాహనాలకు ఈఆర్‌వో నుండి అనుమతులు తీసుకున్న తర్వాతనే ప్రచారాన్ని ప్రారంభించాలన్నారు. అభ్యర్థి పాల్గొనే ఇంటింటి ప్రచార కార్యక్రమానికి కూడా అనుమతులు తీసుకోవాలన్నారు. ఇప్పటికే గ్రామాల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ద్వారా జెండాలు, ఫ్లెక్సీలు, స్టిక్కర్లు తొలగించామని, శిలాఫలకాలు, జాతీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశామని తెలిపారు.

విధుల నుంచి వలంటీరు తొలగింపు

సత్తెనపల్లి: మండల పరిధిలోని గండ్లూరు గ్రామానికి చెందిన వలంటీర్ ఆదంషఫీని విధుల నుంచి తొలగిస్తూ ఎంపీడీవో ఎస్.జగదీష్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వలంటీర్ ఆదం షఫీ తన వాట్సాప్ స్టేటస్‌లో వైఎస్సార్ సీపీ జెండాతో, టోపీ ధరించిన ఫోటో పెట్టుకోవడంతో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఆయనను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీని పై జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సత్తెనపల్లి ఆర్వో వి.మరళీకృష్ణ నివేదిక పంపారు.

చికిత్స పొందుతూ కార్పెంటర్ మృతి

సత్తెనపల్లి: పట్టణంలోని 26వ వార్డుకు చెందిన కార్పెంటర్ మాబు కరీం(43) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. వివరాల మేరకు.. ఈ నెల 18న ద్విచక్ర వాహనం పై అచ్చంపేట రోడ్‌లో వెళ్తుండగా అతనిని లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో మాబు కరీంకు కాలు విరిగి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నరసరావుపేట వైద్య శాలకు తరలించగా మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య సైదాబీ, ఇద్దరి కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించి, పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంటర్మీడియెట్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

క్రోసూరు: క్రోసూరు ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్స్‌పల్ మేరీసు జన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రవేశానికి ఎటువంటి ఫీజు లేదన్నారు. పదవ తరగతిలో సాధించిన మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయించటం జరుగుతుందన్నారు. ఓసీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు రూ.200 ఫీజు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నార్నెపాడులో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

నార్నెపాడు(ముప్పాళ్ళ): మండలంలోని నార్నెపాడు గ్రామంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మంగళవారం జరిగింది. శిబిరంలో ఆయా విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొని, 321 మందికి వైద్య సేవలందించినట్లు పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ ప్రవీణ్ తెలిపారు. 28 మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 13 మందికి కంటి అద్దాలు అవసరమున్నట్లుగా గుర్తించామని, త్వరలో కళ్ళజోళ్లు అందిస్తామని తెలిపారు. గర్భిణులకు, బాలింతలకు అవసరమైన టీకాలు అందించారు. వైద్యులు సాయికృష్ణ, చంద్రశేఖర్, మధులు పాల్గొని వైద్య సేవలందించారు. సూపర్‌వైజర్లు పీటర్‌డేమియన్, జోస్పిన్‌రాణి, ఏఎన్ఎంలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తృటిలో తప్పిన పెను ప్రమాదం



సత్తెనపల్లి: పెనుప్రమాదం తృటిలో తప్పిన సంఘటన మండలంలోని ఫణిదం గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఫణిదం గ్రామానికి చెందిన వలేటి వినయ్ తన పశువులకు.. ముప్పాళ్ళ మండలం మాదలలో రూ. 25 వేలతో మూడున్నర ఏకరాల్లోని వరిగడ్డిని కొనుగోలు చేశాడు. వరిగడ్డిని ట్రాక్టర్‌కు లోడ్ చేసుకొని డ్రైవర్ దొండపాటి యువరాజ్ ఫణిదం గ్రామానికి చేరుకున్నాడు. వరిగడ్డి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌కు కరెంటు తీగలు తగిలి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని గమనించిన డ్రైవర్ యువరాజ్ తన ప్రాణాలకు తెగించి ఊరి చివరికి తీసుకెళ్లి ఖాళీ ప్రదేశంలో ట్రాక్టర్‌ను వదిలి పెట్టాడు. కాగా అప్పటికే మోకులు తెగి మండుతున్న వరిగడ్డి కట్టలు పడటంతో డ్రైవర్ యువరాజ్‌కు గాయాలయ్యాయి. సత్తెనపల్లి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. వరిగడ్డితో పాటు ట్రాక్టర్ కూడా కాలిపోయి నష్టం వాటిల్లింది. గ్రామస్తులు డ్రైవర్ యువరాజ్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

స్కేటింగ్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ రజిత

క్రోసూరు: ఆంధ్ర అమెచ్యూర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలులో జరిగిన 6వ రాష్ట్ర స్థాయి స్కేటింగ్ ఓపెన్ కాంపిటీషన్‌లో క్రోసూరు సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపినట్లు పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ రజిత మంగళవారం తెలిపారు. విద్యార్థులు 14 మంది పాల్గొనగా వారిలో అండర్–11 బాలుర విభాగంలో మన్నెం జ్ఞానేశ్వర్ 100 మీటర్ల రేస్‌లో ద్వితీయ స్థానం, మన్నెం జానేశ్వర్ 200మీ., 400మీ., 1000 మీటర్ల రేసులో తృతీయ స్థానంలో నిలిచారని తెలిపారు. అండర్–14 బాలుర విభాగంలో నరేంద్ర 200 మీటర్ల రేస్, జశ్వంత్ 400 మీటర్ల రేసులో తృతీయస్థానంలో నిలిచారని తెలిపారు. ఆమెచ్యూర్ ఫెడరేషన్ ప్రతినిధులు గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్, ప్రతిభా సర్టిఫికెట్స్ అందచేసినట్లు ప్రిన్స్‌పల్ తెలిపారు. ప్రిన్స్‌పల్‌తో పాటు క్రీడా ఉపాధ్యాయుడు వెంకట్రావు, ఉపాధ్యాయులు విజయ్, బురాన్, పద్మ అభినందించారు.

స్థలం ఆక్రమణపై తహసీల్దారుకు ఫిర్యాదు

క్రోసూరు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన తన 1.5 సెంటు స్థలాన్ని అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకుని, కబ్జా చేసేందుకు యత్నించారని పోలీసుస్టేషన్‌లో, తహసీల్దారుకు, సబ్‌రిజిస్ట్రార్‌కు మంగళవారం బాధితుడు, మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ గార్లపాటిదాసు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు.. 2007లో సర్వే నంబర్ 552లో 249 ప్లాట్‌లో తన కుమారుడు గార్లపాటి మిథున్ పేరుతో 1.5 సెంటు స్థలానికి అప్పటి తహసీల్దారు పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వటం జరిగిందన్నారు. 2012లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కోరిన మీదట పంచాయతీ తీర్మానంతో ఇందిరమ్మ విగ్రహం ఏర్పాటుకొరకు దిమ్మె నిర్మించటం జరిగిందన్నారు. అయితే అదే ఎస్సీకాలనీకి చెందిన చిలకా వెంకటేశ్వర్లు, భార్య మరియమ్మ తప్పుడు డాక్యుమెంట్ సృష్టించి, అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకుని స్థలాన్ని కబ్జా చేసేందుకు దిమ్మెను ప్రొక్లెయినర్ సహాయంతో తొలగించారని పేర్కొన్నారు.